క్లుప్తంగా

రామన్నపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్



ముత్యాలపల్లి ఆరోగ్య కేంద్రంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జ్యోత్స్నాదేవి

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి, కొత్తపాలెం గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్ కొత్తపాలెం ఆరోగ్య కేంద్రంలో సుమారు 70 రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో లేవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులు ఇంటికెళ్లి వారిని పరీక్షించి తగు సలహాలు సూచనలు అందచేశారు. ముత్యాలపల్లి ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ జ్యోత్స్నాదేవి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది బంగారమ్మ, పి శ్యామల, వి సత్యవతి పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



నవుదూదరుగరువులో ఈక్రాప్ నమోదును పర్యవేక్షిస్తున్న ఏఈ రహీమ్

మొగల్తూరు: ప్రతి రైతు తాము పండించిన పంటను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ కోరారు. శేరేపాలెం పంచాయతీ నవుదూరుగరువులో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని వ్యవసాయ భూములను పరిశీలించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు వల్ల అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రాయితీ వంటివి పొందవచ్చున్నారు. అలాగే పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవచ్చని రైతులకు సూచనలు చేశారు.

వృద్ధులకు అండగా నిలవాలి



ఆచంట తహసీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న సంఘ నాయకులు

పెనుగొండ: వృద్ధులకు అండగా నిలిచి ఆదుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆచంట మండల అధ్యక్షుడు కొల్లేపర వెంకన్నబాబు, కార్యదర్శి బాలనాగు శ్రీరామమూర్తిలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆచంట తహసీల్దారు ఎస్.సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే వృద్ధులకు పింఛన్ పెంచుతూ తొలి సంతకం చేసి అండగా నిలిచారన్నారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా ఫించన్ పెంచుకుంటూ వస్తున్నారన్నారు. అదేవిధంగా వృద్ధాప్య వయోపరిమితిని 65 నుంచి 60 ఏళ్లు తగ్గించి వృద్ధుల మనస్సును గెలుచుకొన్నారని కొనియాడారు. వయో వృద్ధులు 18 శాతం ఓటర్లు ఉన్నారన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం వార్షిక ప్రణాళికలో నిధులు కేటాయించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని కోరారు.

కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు

కాళ్ల: పాత గొడవలు నేపథ్యంలో ఓ వ్యక్తిని కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ల మండలం సీసలి గ్రామానికి చెందిన తోట భోగేశ్వరరావు రొయ్యల సాగు చేస్తుంటాడు. ఈనెల 13వ తేదీ రాత్రి తన చెరువు వద్ద నుంచి ఇంటికి వస్తున్న సమయంలో పాత గొడవలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన నూకల సురేష్ మద్యం సేవించి దారికాచి దాడి చేశాడు. ఈ దాడిలో భోగేశ్వరరావుకు గాయాలయ్యాయి. గాయాలపాలైన భోగేశ్వరరావును అతని సోదరుడు వరప్రసాద్ చికిత్స నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

ఆంజనేయుని హుండీ ఆదాయం లెక్కింపు

అత్తిలి: స్థానిక శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 2022 జూలై 1 నుంచి 2023 ఆగస్టు 14 వరకు గల కాలానికి భక్తులు హుండీ ద్వారా సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ. 33,477లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల వెంకటరమణ, దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ దుడే ఉమామహేశ్వరరావు తెలిపారు.

సేవల్లో ఘనం.. సచివాలయం

- ప్రజలకు వేగవంతంగా సేవలు
- ప్రభుత్వ విధానాలపై హర్షం



మేడపాడు గ్రామ సచివాలయం

యలమంచిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు వారి గ్రామాల్లోనే అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ లక్ష్యానికి చేరుకుంది. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందడానికి, పిల్లల చదువులకు అవసరమైన సర్టిఫికెట్స్ తోపాటు ఆధార్ కార్డు మంజూరు, ఆధార్‌లో మార్పులు, చేర్పులు, రైతులకు అవసరమైన రికార్డులు ఈ విధంగా సుమారు 542 రకాల సేవలు సచివాలయంలో అందుతున్నాయి. గతంలో చిన్న ధ్రువపత్రం అవసరమైనా మండల కేంద్రం నుంచి రెవెన్యూ డివిజన్ లేదా జిల్లా కేంద్రం వరకూ తిరిగితే కాని ప్రజలకు ఆ ధ్రువపత్రాలు లభించేవి కావు. ఇప్పుడు ప్రజలు వారు నివసిస్తున్న గ్రామాల్లోనే అన్ని రకాల సర్టిఫికెట్స్ అందుతుండడంతో వారి సమయం, డబ్బులు ఆదా కావడమే కాకుండా ప్రయాణ ప్రయాస కూడా తగ్గింది.

పాలకొల్లు నియోజకవర్గంలో..

పాలకొల్లు నియోజకవర్గంలో ఉన్న పాలకొలు పట్టణం, మండలం, యలమంచిలి మండలం, పోడూరు మండలాల్లో 67 సచివాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం ప్రజలకు సరాసరిన 750 వరకు వివిధ రకాల సేవలు పొందుతున్నారు. చిన్న చిన్న సమస్యలకు మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ముఖ్యంగా పిల్లల చదువుకు, రైతులకు బ్యాంకు రుణాలకు, మహిళలకు ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన సర్టిఫికెట్స్‌ను వలంటీర్లే దగ్గరుండి చేయించడం వల్ల ప్రజలకు సత్వరమే సర్టిఫికెట్స్ అందుతున్నాయి.

భూముల రిజిస్ట్రేషన్స్ సైతం..

సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాలలో భూమి రికార్డులన్నీ కంప్యూటరీకరణ అయ్యాయి. అటువంటి గ్రామాలలో రైతులు తమ భూములు అమ్మాలన్నా, కొనాలన్నా రిజిష్టర్ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేసే వెసులుబాటు కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ చాలా బాగా ఉపయోగపడుతుందని గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్పందనలో ఫిర్యాదులు తగ్గాయి



సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత మాపై పని భారం, వత్తిడి బాగా తగ్గింది. ముఖ్యంగా ఇంటి పన్ను, భూమి పన్ను వసూలు కూడా సులభతరమైంది. విద్యుత్, టెలిఫోన్ బిల్లులను సచివాలయాల్లోనే చెల్లిస్తున్నారు. చిన్నచిన్న సమస్యలన్నీ గ్రామాల్లోనే పరిష్కారమవుతున్నాయి. దీంతో స్పందనకు వచ్చే ఫిర్యాదులు భారీగా తగ్గాయి. **– మాతా సునీల్‌కుమార్, తహసీల్దార్, యలమంచిలి**

అన్ని రకాల సర్టిఫికెట్స్ మా దగ్గరే..



ప్రజలకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్స్ సచివాలయంలోనే మంజూరు చేస్తున్నాం. సర్టిఫికెట్ అవసరమైన వలంటీర్‌కు ద్వారా మమ్మల్ని సంప్రదిస్తున్నారు. వీఆర్‌ఓ స్థాయి అధికారి సచివాలయంలోనే ఉండడంతో వెంటనే ధ్రువీకరిస్తున్నారు. దీంతో మేము అప్లికేషన్ ఆన్‌లైన్ చేస్తున్నాం. సర్టిఫికెట్ మంజూరైన వెంటనే వలంటీర్ ద్వారా వారింటికి పంపేలా చర్యలు తీసుకుంటున్నాం. **– షేక్ ఉమర్ ఆలీష, డిజిటల్ అసిస్టెంట్, మేడపాడు**

పాలకొల్లులో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపిని పార్టీ శ్రేణులకు పరిచయం చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: నియోజకవర్గంలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)ని పాలకొల్లు, యలమంచిలి, పాలకొల్లు పట్టణాలకు చెందిన గ్రామ కమిటీ అధ్యక్షులకు, వార్డు ఇన్‌చార్జ్‌లకు ఎమ్మెల్సీ శ్రీనివాస్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలు ఇన్‌చార్జ్‌గా పనిచేసిన కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనను డీసీసీబీ చైర్మన్, జెడ్పీచైర్మన్, ఎమ్మెల్సీ వంటి ఉన్నత పదవుల్లో కూర్చోబెట్టినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇప్పటివరకు తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు చెబుతూ పాలకొల్లులో వైఎస్సార్ సీపీని విజయపథంలో నడిపించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకుల నిర్ణయాలకు లోబడి అందరితో సమన్వయం చేసుకుని పని చేస్తానన్నారు. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటానన్నారు. నియోజకవర్గంలో స్వతంత్రులను పార్టీలోకి ఆహ్వానించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద ప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, ఎంపీపీ రావూరి వెంకటరమణ, వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, పార్టీ పట్టణ, మండలాల కన్వీనర్లు చందక సత్తిబాబు, ఎం.మైఖేల్‌రాజు, పాత్తూరి బుచ్చిరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, సచివాలయ కన్వీనర్లు పార్కి వెంకటరత్నం, ఎంఎస్ వాసు, ఓదూరి భాస్కరరావు, ముచ్చర్ల శ్రీరామ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్మాణ పనుల పరిశీలన



బాపూజీ పురంలో డ్రెయిన్ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీటీసీ లక్ష్మీ

పెనుగొండ: పెనుగొండ మండలంలో డ్రెయిన్ల నిర్మాణం చురుగ్గా కొనసాగుతుంది. గడపగడపకు మన ప్రభుత్వంలో డ్రెయిన్ల సమస్యను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి ఆయా ప్రాంతాల ప్రజలు తీసుకురావడంతో డ్రెయినేజీ నిర్మాణాలకు ప్రాధాన్యత నిచ్చారు. దీనిలో భాగంగా ఇప్పటికే పెనుగొండ అంబేడ్కర్ కాలనీలోనూ, ములపర్రు పితాని వారి పాలెంలోనూ, సిద్ధాంతంలోనూ డ్రెయిన్ల నిర్మాణాలు కొంత మేర పూర్తయ్యాయి. దీనికి కొనసాగింపుగా పెనుగొండ బాపూజీ పురంలో మండల పరిషత్ నుంచి రూ.10 లక్షలు, గడపగడపకూ మన ప్రభుత్వం నుంచి రూ.8 లక్షలు నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టారు. వారం రోజులుగా డ్రెయినేజీ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. డ్రెయినేజీ పనులను బుధవారం ఎంపీటీసీ మద్దింశెట్టి లక్ష్మీ, వైఎస్సార్ సీపీ నాయకులు పర్యవేక్షించారు. ములపర్రు శివారు పితాని వారి పాలెంలోనూ రూ.13 లక్షల మండల పరిషత్ నిధులుతో పనులు ప్రారంభించారు. డ్రెయినేజీ నిర్మాణం వేగంగా జరుగుతుంది. డ్రెయినేజీ నిర్మాణానికి విద్యుత్ స్తంభాలు అడ్డంగా మారడంతో స్తంభాలను మార్చాలని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు విద్యుత్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో త్వరలోనే స్తంభాలు తొలగించి మిగిలిన నిర్మాణం పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు ములపర్రు సీతారాముని చెరువులోనూ, పెనుగొండ రాజుగూడెంలోనూ రూ.10 లక్షల వంతున డ్రెయినేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో త్వరలోనే నిర్మాణాలు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. మురుగు సమస్యను పరిష్కరించడానికి నిధులు మంజూరు చేసిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు ఆయా ప్రాంతాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అవార్డులతో నూతన ఉత్సాహం



మేడపాడులో తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

యలమంచిలి: పనిచేసే అధికారులకు అవార్డులు గుర్తింపుతోపాటు మరింత సమర్థవంతంగా పని చేయడానికి నూతన ఉత్సాహాన్ని ఇస్తాయని మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దార్ అవార్డు అందుకున్న యలమంచిలి తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్‌ను బుధవారం మేడపాడు గ్రామ సచివాలయంలో గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్ఫూర్తితో ప్రజలకు మరిన్ని నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మేడపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, దేగల వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఎం.హరికుమార్, వీఆర్వో తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యలమంచిలి పీహెచ్‌సీలో..

ఉత్తమ డాక్టర్ అవార్డు అందుకున్న యలమంచిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వర్ధనపు సుభాష్‌చంద్ర స్వరూప్, మేడపాడు పీహెచ్‌సీ ఫార్మాసిస్ట్ మాఘం సురేష్‌కుమార్‌లను యలమంచిలి పీహెచ్‌సీలో సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ సతీష్, ఫార్మాసిస్ట్ మేడికొండ రామదాసు, ఎంపీహెచ్‌ఈఓ జీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్.వరలక్ష్మి

పాలకొల్లు అర్బన్: లోక్ అదాలత్‌లో కేసులు సత్వరమే పరిష్కారం కావడంతో పాటు ఇరువురికి ఆమోదయోగ్యమైన న్యాయం జరుగుతుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వరలక్ష్మి అన్నారు. పాలకొల్లు కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా పోలీసు అధికారులు, న్యాయవాదలులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జడ్జి వరలక్ష్మి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. చెక్ బౌన్స్, కుటుంబ తగాదా కేసులు, రాజీ యోగ్యమైన అన్ని కేసులు రాజీ పడవచ్చన్నారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీసులు, న్యాయవాదులు కృషిచేయాలని కోరారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం నరసాపురం పురపాలక సంఘం అతిథి గృహం వద్ద మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండో విడత గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంద్వారా వార్డుకు రూ.10 లక్షల చొప్పున ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరపాలన్నారు. ప్రజల నుంచి పిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్, సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. తాగునీరు, విద్యుత్, రహదారి, డ్రెయిన్ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను వృథా చేయకుండా సకాలంలో ఉపయోగించుకోవాలని అన్నారు. గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో నూరుశాతం అభివృద్ధి పనులకు ఉపయోగించుకున్నామని తెలిపారు. పట్టణ పరిధిలోని నిధులు ఇంకా పెండింగ్‌లో ఉండడంపై ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్ పర్సన్ కామన నాగిని, యేడిదకోట సత్యనారాయణ (వైకేఎస్), మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ బర్రి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా సీఎం జగన్



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న వడలి తూర్పు వీధి గౌడ సంఘ పెద్దలు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. వడలి తూర్పు వీధి, పిట్టల వేమవరం రోడ్డు గౌడ సంఘ నూతన కమిటీ సభ్యులు బుధవారం తూర్పుపాలెంలో మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. వడలి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతం కంటే వడలిని ఎంతగానో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కుల, మత, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధిని సీఎం జగన్ ముందుకు తీసుకు వెళ్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరింతగా గ్రామాభివృద్ధి చేయనున్నట్లు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ, ఎంపీటీసీ చిటికెన దుర్గా భవానీ, సంఘ పెద్దలు చిటికెన నాగేశ్వరరావు,, కట్టా రామకష్ణ, తొంటా దుర్గారావు, వెలగన నరేష్, చిటికెన నాగేంద్ర ప్రసాద్(బాబీ), కాసాని పెద్దిరాజు, కాసాని శ్రీనివాస్, వెలగన మందయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని పట్టణ ఎస్సై జి.జె ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని రహదారులపై హెల్మెట్ ధరించని వాహనదారులను నిలిపివేసి హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించడం వల్ల వాహనదారుడికి, వారి కుటుంబ సభ్యులకు రక్షణ ఉంటుందన్నారు. ఎక్కువ ప్రమాదాలు సంభవించిన సమయంలో హెల్మెట్ ధరించని కారణంగా మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రయాణ సమయాల్లో హెల్మెట్లు ధరించి సురక్షితంగా ఉండాలన్నారు.

దంత సమస్యలపై అప్రమత్తత అవసరం

పెనుమంట్ర: పిల్లల దంతసమస్యలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి(వాసు) అన్నారు. మల్లిపూడిలోని చాణుక్య స్కూల్‌లో పాలకొల్లు లయన్స్‌క్లబ్, పెనుగొండ విన్నర్‌విల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. పెనుగొండ రత్నా డెంటల్స్ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ మేడపాటి మురళీ జోగిరెడ్డి, డాక్టర్ షాలినీరెడ్డిలు విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, పేస్టులు, బ్రష్‌లు అందజేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకులు మేడపాటి చంద్రమౌళీశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన నాయకులు గుడిమెట్ల ఎల్లారెడ్డి, కొవ్వూరి వెంకటేశ్వరరెడ్డి, స్కూల్ డైరెక్టర్ మల్లిడి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శశిధర్‌రెడ్డికి ఘన నివాళి



శశిధర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

పెనుమంట్ర: జిల్లా వైఎస్సార్ సీపీ మాజీ లీగల్ ఎడ్వైజర్, ఏలూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తేతలి శశిధర్‌రెడ్డి న్యాయవాద వృత్తికి వన్నె తెచ్చేవిధంగా పని చేశారని, ఆయన మృతి ఏలూరు బార్ అసోసియేషన్‌కు తీరనిలోటని అసోసియేషన్ అధ్యక్షులు అబ్బినేని విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పెనుమంట్ర మండలం బ్రాహ్మణచెరువు గ్రామంలోని శశిధర్‌రెడ్డి నివాసంలో సంస్మరణ సభ జరిగింది. ముందుగా పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామారావు శశిధర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.జగన్నాథరెడ్డి, 5వ అదనపు జిల్లాకోర్టు, మహిళాకోర్టు ఎడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు, ఏలూరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిలర్ పత్తిపాటి తంబి, సీనియర్ న్యాయవాది ఏవీ నారాయణ పాల్గొన్నారు.

నిట్ విద్యార్థినికి సాయం

పాలకొల్లు అర్బన్: ఆర్థికంగా పేదరికంతో బాధపడుతున్న విద్యార్థులకు ఉల్లంపర్రు మాంటిస్సోరీ విద్యా సంస్థల తరపున భారీ మొత్తంలో ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని భీమవరం ఆర్డీవో, పాలకొల్లు మునిసిపల్ ప్రత్యేకాధికారి దాసి రాజు అన్నారు. డాక్టర్ సబితా జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్ చదివి జేఈఈలో ర్యాంకు సాధించి నిట్ అగర్తలో సీటు సాధించిన కడితల ధన్యశ్రీకి మాంటిస్సోరీ విద్యాసంస్థల తరపున రూ.2లక్షల చెక్కును ఆర్డీవో రాజు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డా. సబిత జూనియర్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దాల వాసు, ప్రిన్సిపాల్ ఎస్ వసంతలక్ష్మి, ఐఐటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వేగేశ్న అరుణ, మేనేజర్ రావాడ సతీష్ పాల్గొన్నారు.

నరసాపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం

నరసాపురం రూరల్: పట్టణంలో ఓ వీధి కుక్క బుధవారం వీధుల్లో సంచరిస్తూ పలువురుని గాయపర్చింది. దీంతో ఒక్క సారిగా పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మెయిన్‌రోడ్డు, కోర్టు వీధి, కోటిపల్లివారి వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఓ కుక్క వీధుల్లో సంచరిస్తూ పలువురిని కరిచింది. పట్టణానికి చెందిన పి.శ్రీనివాస్, ఎస్.సునీల్ అనే ఇద్దరు యువకులతో పాటు రాధ, వై.గాజులమ్మ, ఏవీ సుబ్బలక్ష్మి అనే ముగ్గురు వృద్ధురాళ్లు, గన్నాబత్తుల వీరాంజనేయులు, ఎస్.అప్పారావు అనే వ్యక్తులను పిచ్చికుక్క గాయపర్చింది. దీంతో వారందరికీ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఇచ్చినట్లు ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జాన్ హారిసన్ తెలిపారు. అయితే ఇటీవల కాలంలో తరచూ కుక్క కాటుకు గురైన కేసులు ఆసుపత్రికి వస్తున్నాయని ఆయన తెలిపారు.

కార్గో సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం రూరల్: నరసాపురం ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండు ఆవరణలో కార్గో కౌంటర్ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఆసక్తి ఉన్న వ్యక్తుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తు చేయాలనుకునే వ్యక్తులు నేరుగా ఆర్టీసీ డిపో మేనేజరును కార్యాలయంలో కలిసి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఢిల్లీకి కలశంలో మట్టి

యలమంచిలి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కలశంతో ఢిల్లీకి పంపాల్సిన మట్టిని బుధవారం మేడపాడులో గ్రామస్తులు సేకరించారు. స్థానిక శివాలయం ప్రాంగణంలో సేకరించిన మట్టిని నా భూమి–నా దేశం స్థూపం వద్దకు తీసుకువచ్చి కలశంలో వేసి పసుపు గుడ్డతో కట్టారు. అనంతరం జాతీయజెండా పట్టుకుని భరతమాతకు వందనం చేశారు. స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మేడపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఎం హరికుమార్, వీఆర్వో తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.